# 4

# ఆర్. చక్రారావు

[కష్టాలు అందరికీ వస్తాయి. ఒక్కొక్కరికి ఒక్కో రకంవి వస్తాయి. కొన్ని కష్టాలకు కారణాలు ప్రత్యక్షంగా విబ్బని వుంటాయి; కొన్నింటికి లేనట్లుంటాయి. కారణాలు వెతకడంలో కష్టాలు మరిచేవారు కొందరు. ఎక్కడికక్కడ దేనికి దానికి ఎదుర్కొంటూ నిన్న రేపులను పట్టించుకోకుండా ఒక నిబ్బరంతో కష్టాలమీదుగా నడిచిపోతుంటారు కొందరు.

కష్టాలలో సగం డబ్బుకు సంబంధించినవి. అది వుంటే ఒక కష్టం; లేకపోతే మరొకటి. డబ్బు లేమి ఒక సంసారంలో కల్పించే చీడలు కొన్నింటిని కలది ఈ కథ. కథానాయకుడి కష్టాలన్నిటికీ అతడి అపర్యమే కారణం అని కాకుండా, అపర్యాన్ని అచరించాలంటే మానసికంగా చాలా సత్తువ కావాలనేదే ఈ కథలో రెండవ వుద్దేశం.

ఈ కథానాయకుడికి. పాపం, ఒక్కొక్క ఋతువులో ఒక్కో కోరిక - పోనీ, అవసరం అందాం - వుంటుంటుంది. కాని అది తీరదు ఈలోగా ఇంకో ఋతువూ, దాంతోటి ఇంకో అవసరమూ వచ్చేస్తాయి. ఇట్లా ఋతువులూ, అవసరాలూ రెండు చక్రాల్లాగా తిరుగుతూంటే అతడి బ్రతుకు బండి ముందుకు సాగుతుంటుంది. అందుకే అతడు ఆర్. చక్రారావు.

హైదరాబాదులో వుండగా నాకు మానవత్వంపై గల నమ్మకం నిల్పిన వ్యక్తులలో ఒకరయిన ఒక డాక్టర్ ఈ కథలో డాక్టర్ రాజేశ్వరిగా రూపొందారు. మిగతా పాత్ర లన్నీ కల్పితం; సంఘటనలు మాత్రం కావు.

కథతో సంబంధం లేనట్టివిగా కనబడుతూ కథ నడక కొంత వేగమూ, సొగసూ ఇచ్చే కొన్ని ముఖ్యవాక్యాలను బ్రాకెట్లలో వుంచడం - ఈ కథలోలా కొత్తపద్ధతి అవుతుం దేమోనని ప్రయత్నించాను. కాని ఈ పద్ధతి నూరింట ఏ ఒక కథకోగాని పనికిరాదని తర్వాత తెలుసుకున్నాను.]

"ఒరేయ్ అబ్బాయ్!.... ఈ ఆదర్శాలనేవి చదువుకోవడానికీ, వ్రాసుకోవడానికీ మా బాగా ఉంటాయి.... ఏం, ఉంటాయి కదా అని ఆచరించబోతే చాలా చేదుగా ఉంటాయి. పట్టుకుంటే గట్టిగా పాషాణంలా ఉంటాయి. గనక, పిచ్చి పిచ్చి నమ్మకాలు పెట్టుకుని జీవితాన్ని పాడుచేసుకోకు. నామాట విను. పెద్దవాళ్ళు పెట్టిన కొన్ని సంప్రదాయాలలో ఎంతో ఉపయోగకరమయిన అర్థం ఉంటుందని తర్వాత తెలిసి వస్తుంది. అంచేత శుభ్రంగా కట్నం తెచ్చే పిల్లనే పెళ్ళాడు. కాదని యీ టీచరు కూతురిని చేసుకున్నావా.... ఆనక నన్నేమీ అడగకు. నీ ఖర్మ!...." అని అన్నారు నాన్న, తొమ్మి దేళ్ళ కింద ఒక రోజున.

ఆ నాడు నాన్నను కాదన్నాడు చక్రారావు.

ఇరవై మూడో యేట, ఇంకా పెళ్ళికాకముందు, ఇంటిపెద్ద ఇంకొకరుగా ఉన్నప్పుడు - ఎవరికయినా జీవితం అంటే ఓ పొడు గాటి తారు రోడ్డులా ఉంటుంది. ఆదర్శాల కారెక్కితే చాలు అతి సునాయాసంగా ఈల వేసుకుంటూ ఆ తారురోడ్డు దాటేయవ చ్చని పిస్తుంది. అంతేకాదు, పెద్దవాళ్ళు వేసే రూపాయల కూడికలూ, ఆశ యాల తీసివేతలూ చూస్తుంటే ఆశ్చర్యమూ, అసహ్యమూ కలుగు తాయి. చక్రారావుకూ అంతే అయింది.

నాన్నను కాదన్నాడు. సీతను తనదానిని చేసుకున్నాడు. పెళ్ళికి కూడా రానన్నారు నాన్న. ఆయన హృదయాన్ని అంతగా నొప్పించాడు; రెండేళ్ళపాటు పట్టుదలలు పరిపాలించాయి. నాన్న ఉత్తరమయినా వ్రాయలేదు. అమ్మ వస్తానంటే అడ్డుపడ్డారట. అని తమ్ముడు వ్రాసేడు. వాడప్పటికి ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతుండేవాడు. అప్పుడప్పుడు ఇంటి విషయాలతో ఉత్తరాలు వ్రాస్తుండేవాడు.

సీత తల్లి అయింది. నాన్న పట్టుదల సడలింది. అయినా హృదయం అంటే గాజు కూజా కాదుగా విరిగింతర్వాత అతక డానికి? తను అలా ఎదిరించిన తరువాత నాన్నకు కాస్తో కూస్తో సంతృప్తి. సుఖమూ ఇచ్చినవాడు తమ్ముడు. వాడు ఇంచక్కా నాన్న చూసిపెట్టిన అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. అయిదువేలు, అదిగాక సైకిలు. ఇంకా అవీ ఇవీ పుచ్చుకున్నాడు. ప్రస్తుతం, వాళ్ళ మామగారి ధర్మమా అంటూ, ఆరేళ్ళ సర్వీసులో అసిస్టెంటు ఇంజ నీరయి కూర్చున్నాడు.

—(అని పై పేరాగ్రాఫులన్నీ అనుకుంటూ) నడుస్తు న్నాడు చక్రారావు. అతగాడి మరదలు సంక్రాంతికని అక్కయ్య యింటికి తెనాలినుండి వచ్చింది. ఓ రెణ్నెల్లుండి ఆపూటే తెనాలి వెళ్ళింది. అధికోత్సాహంతో ఆమె వెంట వెళ్ళి రెండుగంటల ఎక్స్ ప్రెస్‌లో ఆమెను ఎక్కించి పర్మిషన్ గడువు మీరకుండా ఆఫీసు కొచ్చేస్తున్నాడు చక్రారావు.

ఎలెక్షనులో గెలిచిన నాయకుడిలా వెలిగిపోతున్నాడు సూర్యుడు; గుమాస్తా ముండావాడి దారిద్ర్యంలా మండి పోతూంది మధ్యాహ్నపు ఎండ. ఒక్క నిముషం దారిప్రక్కన చెట్టుక్రింద నిల్చున్నాడు చక్రారావు.... చెమటకు తడిసిన చొక్కాలోనుండి ఒళ్లు—నల్లటి సన్నటి ఒళ్ళు కనిపిస్తూంది.... మామూలుగా అయితే చొక్కాకూ, ఒంటికీ మధ్య 'బనియన్' అనే పదార్థం ఒకటి ఉండాలి. ఆ మధ్య ఎపుడో దాకా చక్రారావుకూ ఉండేది. మరీ ఈ మధ్య ఆ మూడోవాడిని కన్నప్పటినుండీ సీత ఇలా చీటికీ మాటికీ అడ్డంపడుతుండెనా—అందువలన తన వందా పాతిక జీతంలో

("నెలలో మొదటి దినము మీ పొదుపు దినము", "మీరు సంపాదించేదంతా ఖర్చు చేయకండి!") నలభై అయిదు రూపాయలు అడ్వాన్సుల క్రింద వెళ్ళిపోతూం డిటీవల.... అప్పటినుండి.... విగత బనియనుడై ....

—నడిచాడు చక్రారావు చెట్టు నీడను వదిలి. (లేః పోతే, చక్రారావు వంటి వాళ్ళ కోసమే నేవిఁటి చెట్లనీడలూ, చల్లగాలులూ? ఇదేం అశోకుడి రాజ్యమా, ఏవఁన్నానా?).... ఖర్చయి పోతున్న జీతంలా త్వర త్వరగా నడిచాడు చక్రారావు.... వెనకటికి ఏదో ఓ కథలో ఒక మహర్షి ఎవడో తన భార్యకు ఎండ తగలకుండా కొన్ని ఏర్పాట్లు చేసిపెట్టాడట.... ("గేదె మార్కు గొడుగు, మంచి టఫేటా సిల్కుతో తయారు చేయబడును.") చక్రారావుకు కూడా ఆ ఋషి కథ తెలుసు. ఇప్పుడు నడుస్తుంటే గుర్తు కొచ్చింది కూడాను. ఉపవాసం ఉన్నవాడికి ఆవకాయ అన్నంలాగున....

మాడు మండుతుంది.... రుమాలు తీసి నెత్తిమీదుగా వేసు కుని దాని నాలుగు కొసలలో రెండింటిని లాగి గడ్డంకింద ముడి పెట్టుకున్నాడు చక్రారావు.... అయిపోయింది. ఇంక ఆఫీ సెంత దూరం? మూడు ఫర్లాంగు లుంటుంది. మూడు ఫర్లాంగు లనగా ఎంత—మహా అయితే ఓ మైలుకన్న తక్కువేగా. వడి హెచ్చిద్దా మనుకున్నాడు చక్రారావు. హెచ్చించాడు. కుడి పాదపు పైరు చెప్పు టప్పుమంది.... ఒరిగిచూస్తే బొటనవ్రేలి దగ్గర తోలు రింగు తెగి పోయి ఝామ్మున విరగబడి నవ్వుతూంది!—అయినా, ఏమీ ఫరవా లేదు. చక్రారావు కుడి చెప్పు ఉపయోగం తగ్గలేదు. అది 'మోహర మున దా నెక్కిన బారని గుఱ్ఱము' కాలేదు.

ఆ యొక్క చెప్పుయొక్క సేవాతత్పరతను మెచ్చుకుని "ఆహా!" అన్నాడు చక్రారావు నోరు తెరచి.... గడ్డం కింద రుమాలు ముడి తెగింది.

ఎట్టకేలకు ఆఫీసు చేరాడు... నెత్తిమీద జుట్టంటూ పెట్టాడా సృష్టికర్త .. నిజంగా దయామయుడు?—లేకపోతేనా!

...అది గ్రీష్మర్తువు!

చక్రారావు మూడో అబ్బాయి చిరంజీవి చంద్రశేఖరుడికి రెండోయేడు నిండబోయింది.

"ఏమండీ? అబ్బాయికి ఎల్లుండి పుట్టిన దినం—" అని మహజ రందిచ్చింది సీత.

"అవునవును...."

"ఏం కొందామూ?"

"ఏం పెట్టి?" అన్నాడు చక్రారావు.

సీత కా మూ డక్షరాలూ చాలా పాతవి.

అక్కడికి ఆ పైలు మూత పడింది.

"నిజంగా మీరు ఎంతో బాగుండవలసిన వారండీ! నాతో బాటు మిమ్మల్ని క్రిందికి—ఈ దారిద్ర్యంలోకి లాగాను. పాపిష్ఠి దాన్ని—" సీత నోటిని మూశాడు చక్రారావు. ఆ చెయ్యే తుడిచింది వెచ్చటి కన్నీటిని. పదేళ్ళ క్రిందయితే ఏడవడం అని 'చా... క్క...సీ...రా...జ...మార్గమూ' ఒక్కటుండేది చక్రారావుకు. అది ఇప్పుడు అలవాటు తప్పింది. (చూశారా మరి—'అభ్యాసము కూసు విద్యే!')

కాసేపు తర్వాత చక్రారావుకు నిద్ర వచ్చింది. కాని సీత మాత్రం క్రిమి సంహారం చేస్తూ కూర్చుంది. ఓ పావుగంట వ్యవధిలో ఓ పది నల్లులూ, ఆరు దోమలూ వైతరణి దాటేశాయి. కాసేపు వేట మాని చిరంజీవుల వైపు చూసింది సీత. మూడోవాడి వీపు ఎర్రటి దద్దులతో పనస తోలులా ఉంది.

'ఛండాలపు దోమలు!... పాపం, వెధవాయి ఎలా నిద్రపోతున్నాడో—!" పోనీ వీడి పుట్టినరోజు కయినా ఒక చిన్న దోమతెర తెమ్మందా మనుకున్నా—కాని—' అనుకుంది సీత. అనుకుని ఇటు తిరిగింది. చక్రారావు చెంపమీద పోటీపడి రసాస్వాదనలో కూడుని ఉన్నాయి రెండు గండు దోమలు—కాని ఆ రసనిలయుడు మాంచి రసవత్తరమయిన నిద్రలో ఉన్నాడు.

సీత అనుకుంది—'దోమతెర ఎంతో అవసరం!'—అవే మేలుకున్న వేళల్లో పది లక్షల రెండుసార్లు అన్నాడు చక్రారావు కూడా.

—ఇంతలో వచ్చింది శ్రావణమాసం. (రాకుండా ఎక్కడికి పోగలదు గనుక?)

ఇత్తడి మరచెంబుమీద నల్లచాదు ముక్కూ, నల్లచాదు కళ్ళతో వరలక్ష్మమ్మను తీర్చిదిద్ది నోము నోచుకుంది సీతమ్మ. సంతానం చాలనీ, సౌభాగ్యం కావాలనీ చెప్పుకుంది సీతమ్మ. తన్నేలినవాడికి మరో వంద ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగ మిప్పించమని కోరుకున్నది సీతమ్మ. అమ్మవారు నవ్వింది. (నవ్వి ఊరుకుంది.)

ఆ మరురోజు పొద్దున్న తమ్ముడి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది చక్రారావుకు.

అవీ, ఇవీ వ్రాసి, ఆఖరికి—

"...అన్నయ్యా,

మరేమో నేనో చిన్న ప్రమోషన్ మీద ఢిల్లీలో ఉద్యోగానికి వెళ్తున్నాను—టెలిగ్రాంమీద ఆర్డర్లు వచ్చాయి గనుక తక్షణమే వెళ్ళి అక్కడ వాలాలి - అందుచేత, దారిలోనే ఉన్నప్పటికీ మీ వూళ్ళో దిగలేక పోతున్నాను—అందుకు క్షమించి మంగళవారం నాలుగింటికి జి. టి. కి నువ్వూ, ఒదినా స్టేషనుకు తప్పకుండా రావలసింది—ఈ మాటే లలిత కూడా వ్రాయమన్నది ..."

అని వ్రాశాడు తమ్ముడు.

వ్రతం చేసింది సీత: ఫలితం దక్కింది లలితకు.

(సీత చేసింది నిష్కామకర్మ అగునా! లేక, పూర్వజన్మలో లలిత ఏమి నోము నోచుకొనెను?)

ఎలాగయితే నేం—చక్రారావు డ్రిల్లు సూటులోనూ, సీతమ్మ కట్ పీసెస్ వాయిల్‌లోనూ తయారయి, చిరంజీవులు ముగ్గుర్నీ పక్కింటి బామ్మ గారికి అప్పజెప్పి (బామ్మ మార్కు స్వచ్ఛంద సేవకులు వర్ధిల్లాలి!) స్టేషనుకు సరిగ్గా టైముకొచ్చారు. చక్రారావులాంటి గుమాస్తా వచ్చిన టైము ననుసరించి తాను రావడ మేవిటని కించపడిన జి. టి. ఎక్స్‌ప్రెస్ క్లాస్—I ఆఫీసరులా 320 నిముషాలు 'లేటు' గా వచ్చింది....

సరే—అది ఇంజన్లు నీళ్ళు తాగేసే స్టేషనేమో—చక్రారావు పావకాళంగా మూడో తరగతి పెట్టె లన్నిటినీ తణిఖీచేశాడు. చేవి విస్పృహ చెందుతుండగా—

"అదిగోనండీ మరదిగారు!" అని గుర్తు పట్టింది సీత.

పదహారడుగుల నిడివి గల ఫ్రేము మధ్య తిరుపతి వేంకటేశ్వరుడిలా మొదటి తరగతి పెట్టె గుమ్మంలో నిల్చుని, చూస్తున్న తమ్ముడు అన్నయ్యనూ, ఒదిననూ గుర్తుపట్టి క్రిందకు దూకాడు.

అన్నయ్యా, తమ్ముడూ కలుసుకున్నారు.

గుమాస్తా, ఇంజనీరూ మాట్లాడుకున్నారు.

సీతా, లలితా కలుసుకున్నారు.

బొంబాయి వాయిలూ, కంచి పట్టూ పలకరించుకుంటున్నాయి.

రైలు కదిలింది.

బత్తాయి పండు తొనల్ని ఒలిచి మొగుడి ఎదుట పళ్లెంలోవి బిస్కెట్ల పక్కగా పెడుతూ—"మీ అన్నయ్య నాన్నగారి మాట విని వుండవలసింది—"అన్నది లలిత. ఎక్కడో చురుక్కుమని తగిలినట్లయింది వా శ్శాయనకు. కాని—మొదటి తరగతి పరుపులూ, బత్తాయి పండ్లూ ఆ చురుకుదనాన్ని చల్లబరిచాయి.

సరిగ్గా ఆ సరికే—

స్టేషను నుండి తమ పేటకు వెళ్ళే ఆఖరి సిటీ బస్సు వెళ్ళిపోగా, అది ఎరిగిన జట్కావాడు రెండు రూపాయ లడగ్గా, వాడి తమ్ముడు రిక్షావాడు రూపాయిన్నర చెప్పాడు—(తగిలిన వేలికే తగులును—అనేది ఆర్యోక్తిట! చక్రారావు ఆర్యుడా?)

"ఎందుకండీ ఈపాటి దానికి రూపాయీ, రెండ్రూపాయిలూనూ—" అంది సీత చిరునవ్వుతో.

"ఆ....!!....వూ...??"

"నెమ్మదిగా నడిచేద్దాం పదండి...."

నడకంటే చక్రారావుకి చెప్పాలేంవిటి? జోరాసింగంత ఉత్సాహమూ, జటోపెక్కంత వేగమూను....! ఎటొచ్చీ సీతకే కాస్త యిబ్బంది.

ఎలాగయితేనేం ఆ రాత్రి పదిన్నరకు పక్కింటి బామ్మగారికి 'రిలీఫ్' వచ్చింది—

ఆ తర్వాత కొన్నాళ్లకు దీపావళి వచ్చింది.

"ఎంతయినా ప్రమిదల కున్న అందం....ఆ బల్బులకురాదు!" అంది సీత ఎదురింటి నియాన్ లైట్ల సోయగాలను చూస్తూ— (పొరుగింటి పుల్లకూర ఎల్లవేళలా రుచి కానేరదు.)

"మరే....! అయినా, సీతా! ఆ ముగ్గుమీద ఒక్కసారే ఆరు ప్రమిద లెందుకూ, రెండు చాలవూ?...." అన్నాడు చక్రారావు— ఆరు ప్రమిదలూ (ఇంటూ) రెండేసి పలాల నూనే (ఇంటూ) పది హేనేసి పైసలూ (ఈజీక్వల్టూ) వగయిరా—

"అమ్మోయ్!.... నా కాకర పువ్వొత్తి ఎలా వెలుగుతోందో చూడవే-" అంది కూతురు లక్ష్మి.

"నీ మొహం! నా మతాబాయే ఎంతో బాగుంది-" అన్నాడు పెద్దవాడు.

వాళ్ళ మొహం వెలుగుతో సీత హృదయం దీపావళి చేసుకుంది....

అన్ని కష్టాలూ అడ్వాన్సు నోటీసు లేకుండానే వస్తాయి. ఆ విధంగానే ఆ రాత్రి రెండు గంటలకు సీతకు హఠాత్తుగా వచ్చింది విపరీతమయిన చలి జ్వరం. మూడో అంతస్తుమీద ఎగరేసిన జండాలా వణికిపోయింది సీత - నిద్రలో ఉన్న చక్రారావు ఆమె మూలుగు విని లేచి కూర్చున్నాడు.

ఆమెమీద మూడు దుప్పట్లు కప్పాడు. ఇంకో రెండు కప్పును గాని, లేవు. అయినా జ్వరం ఎగరేసిన జెండా విజృంభణ తగ్గలేదు.

పిల్లలు ముగ్గురూ నిద్రపోతున్నారు. ఆఖరివాడు ఏదో బొంగరం గురించి కలవరిస్తున్నాడు.

చన్నీటిలో తడిపి సీత నుదుటిమీద చక్రారావు వేస్తున్న గుడ్డలు క్షణంలో పొడి అయిపోతున్నాయి....

'మాంచి రగ్గు ఒక్కటి వుంటే ఎంత బాగుండును-ఈ చలికి వెచ్చగా కప్పివుండవచ్చు' అనుకున్నాడు చక్రారావు. (మెరీనో జాతి గొర్రెలు మంచి ఉన్ని నిచ్చును.)

-"సీతా! అసలే నీ ఆరోగ్యం అంతంతమాత్రంకదా? అంత పొద్దున్నే లేచి ఆ స్నానం చెయ్యడం, ఈ పిండివంటలూ అదీ - ఇంత అలసట వద్దంటే నా మాట విన్నావూ?'' అన్నాడు చక్రా రావు.

ఆస లా మాట వినే దశలో లేదు సీత. హఠాత్తుగా ఏదో అరి చింది. కళ్లు తెరచి ఏదోగా చూసింది.

చక్రారావ్ గుండెలో విష్ణుచక్రం తిరిగింది. పెద్దవాడిని లేపి కూర్చోబెట్టి డాక్టర్ రాజేశ్వరమ్మ దగ్గరకు పరుగెత్తాడు - కాళ్ళ మీద.

ఆమె వెంటనే వచ్చి చూసి ఒక మందు వ్రాసియిచ్చింది. సీత కేమీ ఫరవాలే దంది. రెండు రూపాయ లివ్వబోయిన చక్రారావుతో "అబ్బే! నాకు తర్వాత ఇద్దురు గాని.... ముం దా మందు తెండి. పొద్దుటికి జ్వరం పోతుంది. నాలుగయిదు రోజుల దాకా ఆవిడకు పళ్లూ అవీ యిప్పించండి-'' (ఈ కలియుగంలో ధర్మదేవత పాదం ఆనడానికి ఆమాత్రం చోటయినా కల్పిస్తున్నదీ రాజేశ్వరమ్మలేనేమో!) - అని రిక్షాలో వెళ్ళిపోయింది డాక్టరు. ఆ మంచితనంలో తడిసి ముద్దయి నిల్చున్న చక్రారావు మళ్ళీ పరుగెత్తాడు; ఈసారి బజారు వీథికి.

ఇరవైనాలుగు గంటలూ తెరిచివుండే ఒకానొక మందుల షాపును చేరుకున్నాడు చక్రారావు. నిద్రమత్తుతో, చక్రారా విచ్చిన చీటీని చూచి, డబ్బులు పుచ్చుకుని మందిచ్చాడు షాపువాడు. ఇంటికి పరుగెత్తసాగాడు చక్రారావు.

అప్పులవాడిలా దబదబ చప్పుడు చేసింది ఆకాశం. వీధిదీపా లొక్కసారి ఆరి వెలిగాయి. పెద్ద గాలి వీచింది. ఆ చల్లదనానికి ఆకాశం మబ్బుల దుప్పటి తీసి మెరుపుల కళ్ళతో చూసింది వడిగా, వడిగా వెడుతున్న చక్రారావును.

"అమ్మ చక్రారావూ! నాతో పోటీయే!!'' అనుకుంది మేఘ మాల: టపటపమని నవ్వసాగింది.

నెత్తిమీద చెయ్యి పెట్టుకుని. జుత్తుమీద నుండి నూనెతో కలిసి కళ్ళమీదుగా కారుతున్న వర్షంనీటిని తుడుచుకుంటూ, జేబులో ఉన్న మందు పొట్లం తడవకుండా నడిచి వెడుతున్న చక్రారావుని ఆప్యాయంగా ఆపి రెండు నిమిషాలసేపు నిలువునా స్నానం చేయించింది వర్షం....

'మార్చిలోనే అనుకున్నా, గొడు గొకటి కొనాలని-' అనుకోబోయిన చక్రారావు చెంప ఛెళ్ళు మనిపించే వాన జల్లుని తెచ్చిందొక హోరుగాలి.

'ఈ గాలిలో గొడుగేం ఆగుతుంది-!' అనుకుంటూ చక్రారావు ఇంట్లోకి అడుగు పెట్టాడు.

నాలుఘ్గంటల తరువాత—పొద్దున ఆరింటికి కళ్లు తెరిచి నవ్వింది సీత.

"ఎలా ఉంది సీతా?"

"బాగానే ఉంది....కాస్త నీరసంగాఉంది. అంతే!"

"రెండ్రోజులపాటు నువ్వు కదలకూడదు...."

మళ్లీ నవ్వింది సీత—"అయినా నాకిన్ని దుప్పట్లు కప్పారేమండీ—?"

"ఒక్క రగ్గులేదు కనక!"

అంతవరకూ జాగరణ చేసిన చక్రారావుకు అరగంట తర్వాత కునుకుపట్టేసింది ....

"ఓయ్ షాపువాడా! ఆ జరీ చీరలూ, సూటింగూ వేరుగా ఉంచు. వాటితోబాటే, ఇదిగో చూడూ! ఓ అరడజను మాంచి హైక్లాస్ రగ్గులూ, ఆపాతికమూపాయలదోమతెరలు అయిదూ, ఒకటో రకం రెయిన్ కోటొకటీ పడేయి. అన్నట్టు - మరచిపోయాను. ఓ గ్రోసు గొడుగులు- అవునయ్యా బాబూ! ఓ గ్రోసు గొడుగులు కూడా ఇచ్చేయి....ఏం? బిల్లుఇస్తే ఆనక మా డ్రయివర్‌తో పంపుతా డబ్బు" అని ఎడాపెడా ఆర్డర్లిచ్చేస్తున్నాడు నిద్రలో ఉన్న ఋతుచక్రారావు!